ఆదమరిస్తే అంతే సంగతి..!

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో పెనుగొల్లు పంచాయతీ సోము దేవపల్లి వద్ద వరహానది గట్టు బలహీనంగా ఉండడంతో ప్రజలు భయపడు తున్నారు. గతంలోని ఈ గట్టు కోతకు గురవడంతో పాఠశాల పక్క నుండి పాత సోము దేవ పల్లి కి చిన్నపాటి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఆ చిన్నపాటి రోడ్డుపై వాహనాలు తాకిడి పెరిగింది. అయితే ఇటీవల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆ గట్టు బలహీనపడి మట్టి జారిపోతుంది. అయితే ఆ ప్రదేశంలో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మండలంలోని పి.ఎల్.పురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త కంచి గణపతి గత ఏడాది ఏప్రిల్ నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు పంపిణీ చేసినట్లు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ గెడ్డం బుజ్జి తెలిపారు. కంచి గణపతి పార్టీలో చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సభ్యత్వం వున్న కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 369 మంది జన సైనికులు ప్రమాదాల్లో మృతి చెందగా రూ.17.45 కోట్లు, 443 మంది గాయపడిన వారికి రూ.1.74 కోట్లు బీమా చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఎక్కువ సభ్యత్వాలు నమోదు అయ్యే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి పల్లి దుర్గారావు,

కర్రి బాబురావు, మేడిశెట్టి కృష్ణ, శ్రీరంగం రామకృష్ణ, శ్రీరంగం అభి, పిల్లి వీరబాబు, పిల్లి వెంకటరమణ, సిద్ధ బాబి, పడాల బుల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

యూకలిప్టస్‌పై రైతులు ఆసక్తి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని అన్ని గ్రామాలలో యూకలిప్టస్ మొక్కలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున రైతులు ఈ మొక్కలు నాటడంపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో వీటిని మెట్ట ప్రాంతంలోనూ కొండ వాగుల్లోను, ఏటి గట్లు, గెడ్డ వాగులోనూ తదితర అణువు గాని భూములలో మాత్రమే వీటిని నాటేవారు. ప్రస్తుతం ఈ మొక్కలను మెట్ట ప్రాంతంతో పాటు పల్లపు ప్రాంతంలో కూడా రైతులు నాటుతున్నారు. వీటి ధర ప్రస్తుతం టన్ను 5 నుంచి 6 వేల వరకు ఉండడంతోపాటు వీటికి ప్రస్తుతం గిరాకీ కూడా ఉంది. ప్రస్తుతం రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం కూలీలు ఖర్చు అధికంగా ఉండడంతో రైతులు వ్యవసాయంపై మక్కువ చూపలేదు. మండలంలో 50 శాతం వరకు గతంలో చెరుకును సాగు చేసేవారు. రైతులు పండించిన చెరుకును చోడవరం చక్కెర కర్మాగారానికి చెరకు తూనిక కేంద్రాల ద్వారా నేరుగా ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసేవారు. గత ఐదు సంవత్సరాల నుంచి చోడవరం షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి అగమ్య గోచరంగా ఉండడంతో చెరుకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో పేమెంటు ఇవ్వకపోవడంతో రైతులు చెరుకుపై ఆసక్తి చూపలేదు. అందువలన భూములు ఖాళీగా ఉండకుండా ఉండాలన్న దృక్పథంతో రైతులు యూకలిప్టస్ తోటలపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు వరి సాగు చేసిన పల్లపు ప్రాంతంలో కూడా ప్రస్తుతం ఈ మొక్కలను నాటు తున్నారు. యూకలిప్టస్ మొక్కలు నాటిన తర్వాత 10 సంవత్సరాలలోపు కోతకు వస్తాయి. ఇవి చెట్లను నరికిన తర్వాత మొదలగుండా సుమారుగా ఐదు మొక్కల వరకు ఒక్కొక్క మొదలకు మొలకలు వస్తాయి. అందువలన రైతులు ఒక్కసారి ఈ మొక్కను నాటినట్లయితే ప్రతిసారి నరికిన తర్వాత అలాగనే మొక్కలు వస్తూ ఉంటాయి. ఈ మొక్కలను పశువులు కానీ. మేకలు గొర్రెలు ముట్టుకోవు. ఈ కారణంతో వాణిజ్య పంటలపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

అభ్యాసన పరికరాలతో బోధన సులభతరం

విశాలాంధ్ర - చోడవరం: అభ్యాసన పరికరాలతో కూడిన బోధన సులభతరం అవుతుందని మండల విద్యా శాఖ అధికారులు జయలక్ష్మి, సింహాచలం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్.ఈ.పి) నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా శిక్షా సప్తాహ్‌లో భాగంగా చోడవరం మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన బోధనాభ్యాసన పరికరాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ. జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు సులభ రీతిలో పాఠాలు బోధించేందుకు, వారిలో శ్రద్ధాసక్తులు కల్పించేందుకు అభ్యాసన పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతికత మెరుగుపడుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమం ఈ నెల 22 నుండి 28 వరకు వారం రోజులు పాటు అన్ని పాఠశాలల్లోను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెయిన్ యూ.పి. స్కూలు హెచ్.ఎం. వి.లక్ష్మీ కుమార్, సీ.ఆర్.ఎం.టి. కె.వి.ఎం.నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్చగాళ్ళకు స్వయం ఉపాధిపై కౌన్సెలింగ్

విశాలాంధ్ర - చోడవరం: ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై సి.డి.వి.ఎం. కమ్యూనిటీ వారి సద్భావన టీం ఆధ్వర్యంలో బిచ్చగాళ్లకు చోడవరం శివాలయం వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. సద్భావన టీం సభ్యురాలు, స్థానిక సబ్ రిజిస్ట్రార్ గీతా లక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భిక్షాటన చేసేవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మేధ అవగాహన కార్యక్రమంతో చేపట్టామన్నారు. భిక్షాటన కాకుండా వివిధ ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు మీద బెగ్గర్స్ ఆలోచన చెయ్యాలి అని తెలిపారు. బెగ్గర్స్ వారి అభిప్రాయాలు, ఆలోచనలు కూడా సద్భావ టీంతో పంచుకున్నారు. కొంతమంది భిక్షాటన వదిలి ఉపాధి కోసం వెళ్ళాలి అని తెలిపారు. అటువంటి వారికి అవకాశం కల్పించాలి అని సద్భావ టీం ఆలోచన చేస్తుందని అన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ముందుకు వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సద్భావ టీం కోరింది. మెరుగైన సమాజ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.డి.వి.ఎం. కమ్యూనిటీ ఫౌండర్ కొప్పాక రాజేష్, సద్భావన టీం సభ్యులు, శివాలయం ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు, దస్తావేజులు లేఖరి మురళీ తదితరులు పాల్గొన్నారు.

వరినారుమడులను సందర్శించిన వ్యవసాయాధికారి

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని వర్షాలు కారణంగా నీట మునిగిన వరి నారుమడులను మండల వ్యవసాయ అధికారి స్వప్న సోమవారం కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, ఎన్‌జి పాలెం, జెడ్.తుని గ్రామాలలో సందర్శించారు. వివిధ స్థాయిలలో నర్సరీలను గమనించి ఇనుము లోపాన్ని గుర్తించారు. సందర్భంగా మాట్లాడుతూ కొంతమేరకు ముంపునకు గురయిన నారుమడులలో ఉన్న అదనపు నీటిని రైతులు తీసివేసి, 5 సెంట్ల నర్సరీకి అన్న బేధీ, నిమ్మ ఉప్పు పిచికారీ చేసి తర్వాత యూరియా 1 కేజీ మరియు ఎంటీపీ 1 కేజీని పిచికారీ చేయాలని తెలిపారు. పాము పొడ తెగులు ఆశించిన నారుమడులకు ప్రోపి కోనజోల్ -1 నీటికి కలిపి పిచికారి చేయవలసినదిగా సిఫారసు చేశారు. నీరు బయటకు వెళ్ళని నారుమడులను నష్టం కింద పరిగణించి పై అధికారులకు తెలియజేయడం జరిగింది. అధికారులు నుంచి ఆదేశములు వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎవరైతే రైతులు పూర్తిగా నారుమడిని నష్టపోయారో, వారి నుంచి మరల విత్తనములు వేసుకోవడానికి కావలసిన విత్తన రకముల సమాచారం సేకరించడం జరుగుతుంది. కార్యక్రమంలో ఆర్ఎ ఆర్ఎస్ శాస్త్రవేత్త కె వి.రమణమూర్తి, కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్త రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వడ్డాదిలో జన సైనికుల సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చురుగ్గా కొనసాగుతుంది. సోమవారం వడ్డాదిలో పలువురు జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. ఈనెల 28 వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, కార్యకర్తల సంక్షేమానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్య మిస్తున్నారని నేతలు తెలిపారు. ప్రతి జనసైనికుడికి ప్రమాద బీమా అమలు చేస్తున్నారన్నారు. అడపా నరసింహమూర్తి, దాడి సూరిబాబు,యడ్ల రామ్మూర్తి, దొండా సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీలో నీట మునిగిన రహదారులు

విశాలాంధ్ర - పరవాడ: ఫార్మాసిటీ లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఫార్మాసిటీలోని లోతట్టు ప్రాంత రహదారులు పూర్తిగా నీటితో నిండిపోయి రాకపోకలకు అడ్డంకిగా మారింది. ఆరబిందో ఫార్మా14వ యూనిట్ ప్రాంతం నీటితో నిండి పోయింది. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జవహర్‌లాల్ నెహ్రు ఫార్మాసిటీలో 92ఫార్మా కంపెనీలు పని చేస్తున్నాయి. అయితే తాడి రెవెన్యూ పరిధిలోని చెరువులను సయితం ఫార్మాసిటీ కోసం సేకరించి చదును చేశారు. రాంకీ ఫార్మాసిటీ ఇటీవల రహదారి నిర్మించింది. అయితే లోతట్టు ప్రాంతంలో యథా విధిగా రహదారిని నిర్మించడంతో రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. అలాగే వర్షం నీరు ప్రవహించేందుకు నిర్మించిన భారీ డ్రైన్‌ను సిమ్మెంట్ షీట్స్‌తో పూర్తిగా మూసివేశారు. వర్షం నీరు ప్రవహించే అవకాశం లేక పోవడంతో వర్షం నీరు రహదారిపైనే నిలిచిపోయింది. ఇక ఫార్మాసిటీకి వచ్చే వాహనాలు రహదారిపైనే నిలిపివేశారు. తక్షణమే వర్షం నీటిని భారీ యంత్రాలతో తోడేందుకు చర్యలు తీసుకోవాలని ఫార్మా ఎంటర్‌ప్రెన్యూర్స్ డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు అర్జీలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి జోరు వానలో సైతం ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. జోరు వాన సైతం లెక్క చేయక ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన వారి వద్ద నుంచి కలెక్టర్ విజయ కృష్ణన్ వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, రమామణీ వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37 అర్జీలు

జిల్లా పోలీసు కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన 37 ఫిర్యాదులలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు చీటింగ్ తదితర ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్సై సావిత్రి పాల్గొన్నారు.

రూ.25 లక్షల విలువ గల మొబైల్ ఫోన్లు రికవరీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ సీఈఐఆర్‌లో పోయిన మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చు అని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. ఆపై వెంటనే ఐటీ కోర్ బృందం ట్రేస్ చేస్తూ బాధితులకు మొబైల్స్ అందజేసేందుకు కృషి చేస్తుందన్నారు. అలాగే మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్:95052 00100కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా (akpmobiletracker.in) లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్.ఐ.ఆర్ కట్టకుండా, పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసిన జిల్లా పోలీసులు, మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 6వ విడతలో భాగంగా సోమవారం 176 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు ఐటీ కోర్ టీమ్, పోలీసులు మొబైల్ ట్రాకింగ్‌పై బాగా పని చేస్తున్నారన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామన్నారు. మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్‌లకు వెళ్ళడంపై అసౌకర్యంగా ఉందని ఫీడ్ బ్యాక్ రావడంతో సులభతరమైన పద్ధతిలో మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్ సైట్ ను ఏర్పాటు చేశామన్నారు.

మొబైల్ మిస్సింగ్ కేసులలో త్వరితగతిన రికవరీ అవుతున్నందువలన ప్రజలు మొబైల్ మిస్సింగ్‌పై ఫిర్యాదులు చేయుటకు ముందుకు వస్తున్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరి అయిన వాటి పరిష్కారంపై అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సెల్ ఫోన్లు రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉందని, జిల్లా ఎస్పీకి, అనకాపల్లి జిల్లా పోలీసులకు సెల్ ఫోన్లు పొందిన వ్యక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మొబైల్ రికవరీ మేళా కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, ఎస్సై రఘు వర్మ, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలమైన తుఫాన్ షెల్టర్లపై స్పందించిన డీఈఓ

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో శిథిలమైన తుఫాన్ తుఫాన్ షెల్టర్లపై జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు - పట్టించుకోని అధికారులు, బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు అనే వార్త విశాలాంధ్రలో ప్రచురితమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ స్పందించారు. శిథిలమైన తుఫాన్ షెల్టర్లు, పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులపై వివరణ ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. గత 35 ఏళ్లుగా వెంకటనగరం, శివారు రాజానగరం, రాజవరం శివారు గజపతినగరం గ్రామాలలో ఉన్న తుఫాన్ షెల్టర్లు శిథిలావస్థలో చేరుకున్నాయని, మూడు తుఫాన్ షెల్టర్లు ప్రభుత్వ పాఠశాలల పక్కనే ఉన్నాయని, వీటిని తొలగించాలని పలుసార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. విశాలాంధ్రలో ప్రచురితమైన వార్త ఆధారంగా ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా శిథిలమైన తుఫాన్ షెల్టర్లు పడగొట్టాలంటే పంచాయతీరాజ్ శాఖ అనుమతులు ఉండాలని,

పడగొట్టేందుకు అయ్యే ఖర్చు మండల పరిషత్ భరిస్తుందని చెప్పినట్లు ఎంఈఓ గాంధీ, జిల్లా విద్యాశాఖ అధికారికి ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర - ఎలమంచిలి: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ఎలమంచిలి క్రీడాకారులు 8 బంగారు పతకాలు సాధించారని తైక్వాండో కోచ్ నాగిరెడ్డి సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆదివారం గాజువాక నడుపూరు ఉక్కు కళా వేదికలో జరిగిన 43వ జూనియర్, సీనియర్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ఎలమంచిలి సత్య స్పోర్ట్స్ అకాడమీ నుంచి పది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో భవ్య శ్రీ, ఎం.హర్షిత, జయ శ్రీ, వి.సౌజన్య, గాయత్రి, టి.శ్వేత, ఎన్.మోహిత్, అరుణ్ కుమార్ బంగారు పతకాలు సాధించగా వుడా నంద కృష్ణ, విష్ణువర్ధన్ రజిత పతకాలు సాధించారు. విజేతలను తైక్వాండో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత రెడ్డి, అచ్చం నాయుడు అభినందించారు.

పెదఈశ్వరరావును పరామర్శించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: వైసీపీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావును వైసీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు భార్య అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. దీంతో వైసీపీ సీనియర్ నాయకుడు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ దార్లపూడి గ్రామంలో ఆయనను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అద్దేపల్లి నూకినాయుడు, కశికోంట నీలందరావు, మామిడి చంటి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి నీరు విడుదల

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పెద్దేరు జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 136 మీటర్లు కాగా సోమవారం ఉదయానికి 135.95 మీటర్లకు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు జలాశయం మూడు గేట్లు ఎత్తి దిగువకు 585 క్యూసెక్కుల అదనపు నీటిని దిగువకు విడిచిపెట్టారు. పెద్దేరు నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

శిథిల పాఠశాలలను పరిశీలించిన డీఈఓ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలో శిథిలావస్థలో ఉన్న పోతనపూడి, సిహెచ్.గదబూరు, లక్ష్మీపేట పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటలక్ష్మీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా ఫొటోలు తీశారు. అనంతరం ఈ పాఠశాలల పరిస్థితిపై ఎంఈఓ దేవుడమ్మతో చర్చించి వీటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అలాగే పాఠశాలలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అక్కడ పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

మైచర్లపాలెం శ్రీ రామునికి సామూహిక హారతి

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని మైచర్ల పాలెం గ్రామంలో భక్తులు, గ్రామస్తులు గణపతి సహిత మహాలక్ష్మి, శ్రీ సీతారాములు వారికి ఆదివారం రాత్రి సామూహిక హారతి అందజేశారు. వ్యాస పూర్ణిమ (గురు పౌర్ణమి) సందర్భంగా సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామునికి పురుష సూక్త విధానంలో యధావిధిగా ప్రత్యేక అర్చన, అభిషేకములు జరిపించిన అనంతరం సంపూర్ణ సామూహిక పౌర్ణమి హారతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరె మాణిక్యం, ఆలయ ప్రధాన అర్చకులు పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని పి.ఎల్.పురం గ్రామంలో స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఐవి, సుఖ వ్యాధుల పట్ల ఐఇసి మెటీరియల్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్య క్రమంలో డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవింద్, జోనల్ సూపర్వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జి.సిహెచ్.నర్సింగరావు, ఎం.ఎల్.హెచ్.పి. సిహెచ్. కళ్యాణి, ఏ.ఎన్.ఎం. వి.ఎం.ఎస్ లక్ష్మి, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మచ్చలు, తిమ్మిర్లు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: శరీరంపై తిమ్మిర్లు, మచ్చలు రాగిరంగులో స్పర్శ లేని చర్మం తదితర సమస్యలు ఉంటే అది కుష్ఠు వ్యాధికి ప్రారంభ దశ కావచ్చని అలాంటి వ్యక్తులు సమీప ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ చేయించుకోవాలని హెల్త్ సూపర్వైజర్ జవ్వాది సన్యాసిరావు తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని ఆర్‌వై అగ్రహారం, కేజే పురం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందితో కలసి ఇంటింటికి తనిఖీలు నిర్వహించారు. ఎల్‌సిడిసి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి ఆగస్టు రెండు వరకు ఈ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. స్పర్శ లేని మచ్చలు ఉంటే తనిఖీలు నిర్వహించుకొని అవసరమైన మందులు వాడుకోవాలన్నారు. అందువల్ల అంగవైకల్యం రాకుండా చూసుకోవచ్చు అన్నారు. హెల్త్ అసిస్టెంట్ గంగాధర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పి మంగవేణి రాము పాల్గొన్నారు.